# వ్యత్యాసం!



**తాళ్లూరు నాగేశ్వరరావు**

పంచాయతీ బోర్డు వైస్ ప్రెసిడెంటు వీర వెంకట సూర్యచంద్రమోహనరాజు గారి అబ్బాయి నీలకంఠరాజూనూ, అదే పంచాయతీలో బిల్లు కలెక్టరుగా పనిచేస్తున్న ఆదికేశవులు కొడుకు ఆదినారాయణానూ దోస్తీ. ఇద్దరూ కాలేజీలో పి. యు. సి. వాణిజ్యశాస్త్రం చదువుతున్నారు.

నీలకంఠరాజు ఎప్పుడూ అరవిచ్చిన మల్లెపువ్వులా ఉంటాడు. టెరిన్ కాట్టాం ప్యాంటూ, ఒంటికి ఉల్లిపొరలా అంటుకుపోయిన టెర్లిన్ స్లాకూ ధరిస్తాడు. దూది నొక్కినట్టుగా నున్నగా తల దువ్వుతాడు. నల్లద్దాల కళ్ళజోడు పెడతాడు. గోల్డుఫ్లాక్ సిగిరెట్టు తప్ప కాల్చడు. టైం టేబుల్ ప్రకారం వారానిక నాలుగు సినిమాలు చూస్తాడు. ఆడపిల్లలకు పోజులు కొట్టడం ఒక హాబీ. పచ్చి శృంగార కథల పత్రికలు తప్ప మరో పత్రిక చదవడు. క్లాసులో ఎప్పుడూ ఒక అంకెకు మించి మార్కులు రావు. అతగాడికి చదువు ఒక కాలక్షేపం తప్ప పొట్టకూటికి సాధనం మాత్రం కాదు. మరి తండ్రికి మూడెకరాల కొబ్బరితోట ఉంది; రెండెకరాల అరటి తోట ఉంది ; అయిదెకరాల మాగాణిభూమి వుంది ఎట్లాలేదన్నా సంవత్సరానికి పదివేల రూపాయల దాకా ఆదాయం వస్తుంది. సుపుత్రుడు ఒక్కడే !

ఆదినారాయణ ఎప్పుడూ వడదెబ్బ తగిలిన పువ్వులా నలిగి వుంటాడు. చవుకబారు కాటన్ దుస్తులు తప్ప ధరించడు. ఇంట్లో నూనె లేదేమో అన్నట్టు తల రేగివుంటుంది. కళ్ళజోడు పెట్టడు. సిగిరెట్టు వాసనకూడా పడదు. సంవత్సరానికి ఒక్క సినిమాయే చూస్తాడు. ఆడపిల్లలవేపు కన్నెత్తి చూడడు. తీరికున్న కాలంలో వార్తాపత్రికలు తప్ప చదవడు. పాఠ్యపుస్తకాలే అతని ప్రపంచం. ఎప్పుడూ క్లాసులో ఫస్టు మార్కులే వస్తుంటాయి. అతని చదువు ధ్యేయం - పరీక్షలు ప్యాసై, ఉద్యోగం సంపాదించి, జీవనం గడపడానికి తండ్రికి స్థిర చరాస్తు లేమీ లేవు. నెలకు నూట యాభై ఎనిమిది రూపాయల జీతం వస్తుంది. అన్ని అలవెన్సులతో కూడి ఆ జీతం తోనే నలుగురు పిల్లల సంసార శకటాన్ని లాగించాలి.

ఆర్థిక వ్యత్యాసాల ద్వారా కుటుంబ హోదాల్లో ఎక్కడా పోలిక లేని నీలకంఠరాజూ, ఆదినారాయణా ఒక రోజు మధ్యాహ్నం కాలేజీ ఫీజు కట్టడానికి ఆఫీసు కౌంటర్ దగ్గరకు వెళ్ళారు.

"నువ్వు కట్టే జీతమెంత?" అన్నాడు ఆదినారాయణ స్నేహితుణ్ణి ఉద్దేశించి.

"నాకు సగంజీతమే!" అన్నాడు నీలకంఠరాజు షొక్కా కాలరు పైకి ఎత్తుతూ.

ఆదినారాయణ ఆశ్చర్య చకితుడైనాడు.

"అదెట్లా?"

"అంతే! సంవత్సరానికి పదిహేను వందల రూపాయల ఆదాయం లోపువారికి సగం జీతమే"

మీ నాన్నగారి ఆదాయం సంవత్సరానికి పదిహేను వందల లోపేనా?"

"ఎందుకైంది? మాకు సంవత్సరానికి పదివేల రూపాయల ఆదాయం వస్తుంది. కాని ఇట్లాంటి సమయాల్లో కాగితాల్లో ఎంత తగ్గమంటే అంత తగ్గుతుంది. ఇదిగో ఇన్‌కమ్ సర్టిఫికెట్. పన్నాలుగు వందలతొంభై అయిదు రూపాయలు. మన వూరి కర్ణం సర్టిఫై చేశాడు. తాశీల్‌దార్‌గారు సంతకం చేశాడు. నీకు లేదా సర్టిఫికేట్."

ఆదినారాయణ నిశ్చేష్టుడై మొహం ప్రక్కకు తిప్పాడు. వెంటనే అతనిలో ఏదో పిచ్చి ఆవేశం వచ్చింది. 'క్యూ'లో నుంచి బయటికొచ్చాడు.

నేరుగా ఇంటికి పరుగెత్తుకొచ్చాడు.

ఆదికేశవులు బిల్లు పుస్తకాల్ని దస్కుముందు వేసికొని, ఆరు పైసలు తేడావస్తే అరగంటనుంచీ కూడికల్లో కొట్టుమిట్టుకు లాడుతున్నాడు.

"నాన్నా! కాలేజీలో సగం జీతానికి నేను అర్హుణ్ణికానా?"

"కాదురా అబ్బాయ్! నా జీతం సంవత్సరానికి పదిహేను వందలకు మించుతుంది. అదంతా ప్రభుత్వం ఆదాయంగా పరిగణించి, మనబోటి వాళ్ళకు ఆ రాయితీ లేకుండా చేసింది."

"మరి వైస్ ప్రెసిడెంటుగారి అబ్బాయికిచ్చిందే కన్సెషన్!"

"అవును, వ్యవసాయంమీద వచ్చే ఆదాయం ఎప్పట్లోవుండేదేకాని ప్రభుత్వంవారి లెక్కల్లోకి వచ్చేదికాదు. స్థానిక పలుకుబడికి లోబడి కరణం పదివేల రూపాయల ఆదాయం వచ్చే ఆసామికి కూడా పదివందల అయివేజని సర్టిఫికెట్ ఇస్తాడు. దానిమీద తాశీల్దారుగారి గుమస్తా పావలా పుచ్చుకొని ముద్రవేస్తాడు. ఆ ముద్రపైన తాశీల్దారుగారు కళ్ళుమూసుకొని సంతకం చేస్తాడు. మన బోటోళ్ళం ఉన్న జీతాన్ని తగ్గించలేం. అథవా తగ్గిస్తే సవాలక్ష ప్రశ్నలూ, తనిఖీలూ! కుర్రవాడివి నీకు కొత్తగాని, ఇలాంటి తంతులూ తతంగాలూ దేశంలో నిత్యమూ జరుగుతూన్నవే!... ఇంతకూ జీతం కట్టావా?"

ఆదినారాయణ కళ్ళొద్దుకుంటూ కాలేజీకి బయలుదేరాడు.

"ఒరేయ్! అబ్బాయ్! డబ్బు జాగ్రత్త!.... నాలుగు గడపలెక్కి, అప్పు లేదనిపించుకొని, అయిదో గడపలో కాళ్ళా వేళ్ళా పడితే ఆ మాత్రమైనా అప్పు పుట్టింది. వెంటనే జీతం కట్టు. ఇలాంటి వ్యవహారాల్ని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ..." ఆదికేశవులు ఏదో అంటూనే వున్నాడు.

ఆదినారాయణ ఇంటిగడప ఎప్పుడో దాటాడు.